# భావి ఫిలింగోయర్‌కు లేఖ

నేను ఈ గదిలో వొంటరిగా కూచుని, నీ కోసరమని ఈ లేఖ రాస్తున్న సమయంలో జన్మించావు. పట్నం బయట చిన్నగుడిసెలో పుట్టిన నిన్ను మీ తల్లి ఎంతో ఆదరంతో, ఆశ్చర్యంతో దగ్గిరకి తీసుకుంది. మీ నాన్న నీ కోసరం చెమటోడుస్తూ పట్నంలో పనిచేస్తున్నాడు, మీ అమ్మ చింకి మంచంమీద నిన్ను పడుకోబెట్టి జోకొడుతోంది. నీ మాటల్లోని– ఏడుపనుకుంటారు భాష తెలీక–"భావి ప్రపంచ పౌరుణ్ణి" అనే భావాన్ని ప్రకృతే కొంచెంగా అర్థం చేసుకుందిగావును చల్ల బడుతోంది!

ఒక నెల్లాళ్ళు గడిచాక కొత్తపిల్లాడ్ని కన్న ఆనందంతో మీ నాన్న "సినీమాకి పోదామా?" అన్నాడు మీ అమ్మతో.

కాని దానికి ఒక రోజుకూలి అవసరంగా ఖర్చవుతుందని తెల్సుకున్న మీ తల్లి జాలిగా, నిరాశతో చూసింది.

పోనీ తీరా వెళ్ళినా రోజంతా అల్సిన మూలాన నిద్ర ఆగడం కష్టం. కష్టపడే మీ నాన్న ఆ సోమరిపోతుల్లో, రౌడీల్లో కూచుందుకు బాధపడేవాడు. అయినా మీ అమ్మని బలవంతం మీద ప్రయాణం చేయించాడు.

ఆ రోజుల్లో మీ నాన్నవంటి వాళ్ళని, వాళ్ళల్లో మిగిలిన పుక్కిటి పురాణాల ప్రభావాన్నాధారంగా చేసుకుని దోచుకుందుకు పౌరాణిక చిత్రాలు ఎక్కువగా తీసేవారు. అందులో సబబు, సందర్భం వుండవు. ఏమీ సందేశమిచ్చేవి కావు. నిద్రమత్తుగా వుండేవి. వాళ్ళని ఇంకా ఆ మూఢనమ్మకాల్లో, అట్టాంటి పరిస్థితులకి అంటిపెట్టుకునేట్టు చేసే పిచ్చి భావాల్ని చూపించేవారు.

పోనీ ఏ సందేశరాహిత్య చిత్రాలైనా, పుక్కిటిపురాణాలైనా, కళగాని, పూర్వపు రోజుల చారిత్రక జీవనంగాని చూపించే సంస్కారం, విజ్ఞానం ఆ రోజు దర్శకులకు శూన్యమేమో? అనిపిస్తుంది. పౌరాణిక నాయకీ నాయకులు జంపర్ జాకెట్లూ, పైకి కనపడే అండర్‌వేర్సుతో ప్రత్యక్షమయ్యేవారు.

ఎంత పరిశ్రమైనా, స్వంతలాభం వున్నావాళ్ళు కొంచెం బ్రెయిన్ విప్పి ఆలోచించడానికి ఇష్టపడేవారు కారనుకుంటాను.

చీప్ హ్యూమర్‌తో, కామవాంఛల్ని రేకెత్తించే అసహ్యకరమైన దృశ్యాలతో ఎంతో నీచంగా అమాయకుల్ని దోచడానికి ప్రయత్నించేవారు.

సినిమాకి వెళ్ళింది మొదలు ఏదో బాధపడడం ప్రారంభించాడు మీ నాన్న, ఏమిటో తనవంటి జీవితాలకి సంబంధించని, కనీసం యింప్రెస్ చెయ్యని చిత్రాన్ని చూడలేకపోతున్నాడు గావును! యుగయుగాలనించి ఏ మానసిక బానిసత్వాన్ని పెంచుకు, ఇవ్వాళ ఈ స్థితిలో వున్నామో, మళ్లీ ఆ తుక్కుభావాలనే ఆ చిత్రంలో డబ్బు యిచ్చుకుచూడడం, మరీ కష్టమనిపించినట్టుంది.

పక్కనవున్న ప్రజాసామన్యం ప్రొడ్యూసర్సు నీచపు కోర్కెల్ని నెరవేరుస్తున్నట్టు – ఈలలు, గోలలు చేసేవారు "ఈ దోపిడీ అట్టే కాలం వుండదులే!" అని బయటనించి వొచ్చిన గాలి ఏదో సందేశమిస్తున్నట్టుంది మీ నాన్నకి.

మీ అమ్మకూడా సినిమాని చూసి ఏం ఆనందించలేకపోయింది. "ఇవ్వాళ సినిమా ఖర్చుపెట్టాం. రేపు తిండికి కష్టం కదా!" అని ఆలోచిస్తో కూచుంది.

ఒక్కసారి వెనక్కి తిరిగాడు మీ నాన్న 'మూడు అణాల' తరగతినించి. ఒక్కొక్క అంతస్థే ఎందరో ధనవంతులు అధికార్లు కూచున్నారు సుఖంగా. వాళ్ళకుండే సౌకర్యాలేమీ లేకపోయినా, కనీసం శుభ్రమన్నా లేదు మీ నాన్న కూచున్న తరగతిలో. ప్రతీ గొప్పవాడు నెలకో, రెండునెల్లకో వొస్తాడు సినిమాకి గొప్పకి. ప్రతి జట్కావాడు, కూలివాడు వినోదంకోసరం రోజువిడిచి రోజన్నా వొస్తుంటాడు.

నీకు తెలుసో లేదో కాని ఆరోజుల్లో ఒక్క 'మూడణాల' తరగతీ తక్కిన అన్ని తరగతులంత స్థలం ఆక్రమించుకునేది. మొత్తంమీద ఇక్కడ్నించే ఎక్కువ డబ్బు గుంజేవాళ్లు సినిమా పెట్టుబడిదారులు. అయినా వీళ్ళకే సౌకర్యాలు శూన్యం సినిమా హాళ్లో.

అన్నీ మనస్సుకి తట్టాయేమో మీ నాన్న లేచివొచ్చి, మీ అమ్మ సినిమానించి వచ్చేవరకూ గేటు దగ్గర ఎదురు చూస్తున్నాడు. 'ఇంకెప్పుడూ సినిమాకి పోకూడదు' అనుకుంటున్నట్లున్నాడు. దేశ పరిస్థితుల్ని ముందుగా మార్చుకోవాలి! నూతన సమాజాన్నీ, జీవితాన్నీ సృష్టించుకోవాలి!! అప్పుడుగాని ఏ రంగమైనా అభ్యుదయం పొందదు. అభివృద్ధి నిరోధకత్వం చావదు!

ఇట్లాగే ఏదోవేగ్‌గా మీ తండ్రి అనుకున్న భావమే, ఇంకా ఎందరో ప్రతిజ్ఞగా తీసుకుని, నీకీ నూతన సమాజాన్ని ఏర్పరచారు. అదృష్టవంతుడవైన నీకోసరం, నీ సౌఖ్యంకోసరం ఎంతెంత కష్టాలుపడ్డారో మీ తండ్రులు, తల్లులు, ఒక్కసారి చరిత్రని తిరిగిచూస్తే అర్థమవుతుంది.

ఈనాడు నీకు తుక్కు సినిమాలు లేవు, చెమటవాసన హాల్సు లేవు. తీరిక కాలమప్పుడు కావల్సినంత ఆనందాన్ని, విజ్ఞానాన్ని, వివేకాన్ని, వినోదాన్ని ఇచ్చే ఎన్నో చిత్రాలు వొస్తున్నాయి, సంకుచితోద్దేశాలతో కాక విశాలమైన జాతీయ దృక్పథంతో చక్కని చిత్రాలు వున్నాయి. ప్రతీ సామాన్య పౌరుడూ సంతోషంగా అనుభవించేందుకు, అర్థంచేసుకునేందుకు ఎన్నో అవకాశాలు వున్నాయి!

ఇట్లాంటి మార్పులకోసరం చేసిన పోరాటాల్లో, నూతన సమాజం నిర్మించడంలో, నావంటివాళ్ళ పాత్రకూడా వుందని సగర్వంగా చెప్పడానికి సంతోషిస్తున్నాను.

మరచిపోకు!

ప్రేమపూర్వకాభి నందనాలతో
'నీ మిత్రుడు'

– అనందవాణి